నేడు డయల్ యువర్ ఆర్ఎం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు సమస్యలు ఏవైనా ఉంటే 9959225848 నంబరుకు ఫోన్ చేసి తెలపాలన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల లోపు ఫోన్ చేయాలని సూచించారు.

పెన్నా చుట్టూ... పచ్చకోక కట్టినట్టు



చుట్టూ పచ్చని కొండలు... మధ్యలో ఒంపులు పోతూ పెన్నా ప్రవాహం... నదీ ప్రవాహానికి ఇరు వైపులా పచ్చటి వరిపొలాలు చూపు తిప్పకోనివ్వని అందాలు ఆప్రాంతం సొంతం... ఆసాంతం చేస్తే మది పరవశించక తప్పదు.. కడప నగర శివారుల్లోని పెన్నా సోయగాలు కోనసీమను తలపించేలా ఎటు చూసినా కనుచూపు మేర పచ్చని తివాచీ పరిచినట్టుగా మారింది. గండికోట, మైలవరం జలాశయాల నుంచి వచ్చే నీటితో పెన్నా పరవళ్లు తొక్కుతుండగా సిద్ధవటం ప్రాంతంలో రైతులు విస్తారంగా వరిసాగు చేయడంతో ఈ సుందర దృశ్యం సాకారమైంది. ఆ చిత్రమే ఇది. **- ఈనాడు, కడప**

రక్షకుడా వందనం...

నీ సేవలు అజరామరం



మన ప్రాణానికి ఆయుష్షు... మాన, ధనానికి శ్రేయస్సు...
మనకు భయమేస్తే ధైర్యం... కష్టమొస్తే స్థైర్యం
తప్పు చేస్తే శిక్ష... ముప్పు వస్తే రక్ష
విధి నిర్వహణలో వీర
మన భద్రతకు ప్రాణాలు లెక్కచేయని ధీర
సంఘానికి రక్షణ... సమాజానికి క్రమశిక్షణ
అక్రమార్కులకు భయం... అమాయకులకు అభయం
చట్టానికి కిరీటం ఆ టోపీ... భరోసాకు తీవి ఆ లాఠీ
దుండగుల పాలిట సింహస్వప్నం...
కనిపించని ఈ నాలుగో సింహం
గుండాల గుండెల్లో కాక ఈ ఖాకీ...
మాకు కష్టం వచ్చినప్పుడు ముందుండి
మా రక్షణ కోసం ప్రాణాలొడ్డే వీరులకు
రాజుల పాలన నుంచి ప్రజాస్వామ్య ప్రభుత్వాల వరకు
సామాన్యులకు రక్షణగా నిలిచిన వీరులందరికీ వందనం... అభివందనం
పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా...

- సలాం పోలీస్

ప్రత్యేక కథనం 6లో...

వీరుడిగా వెళ్లి... విగతజీవిగా మారి



బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల బాంబుదాడిలో మృత్యువాత పడిన అమర జవాను **కొడవకంటి రాజేష్** పార్థివదేహం ఆదివారం రాత్రి బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లె పంచాయతీ, పాపిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీకి చేరింది. సైన్యంలో పనిచేస్తున్న రాజేష్ మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమర్చిన బాంబు పేలి అశువులు బాసిన విషయం తెలిసిందే. దేశసేవ చేయాలని సైన్యంలోకి వెళ్లిన తమ కుమారుడు విగతజీవిగా గ్రామం చేరడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు కన్నీటిపర్యంతమయ్యారు. వారి ఆర్తనాదాలు మిన్నంటాయి. జవాను రాజేష్ భౌతికకాయానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.



- ప్రేమంటే...
ఇద్దరు మనుషుల ఒకే శ్వాస
అతను కేవలం కామంతోనే చూశాడు
- ప్రేమంటే ఒకే ధ్యాస...
అతను వంచనే ఎజెండాగా చేసుకున్నాడు
- ప్రేమంటే ఒకరికొకరమని చేసుకునే బాస
కానీ ఒకరిని ప్రేమించి మరొకరిని పెళ్లి చేసుకున్నాడు
- ప్రేమంటే కష్టనష్టాలొచ్చినా కలిసుండాలనే ఆశ
నమ్మినందుకు కష్టాలెన్నో సృష్టించాడు
- తుది శ్వాస వరకు తనతోనే జీవితమనుకుంది
మరో యువతిని పెళ్లాడినా తనను వదలకుండా వెంటాడాడు
- అగ్ని సాక్షిగా పెళ్లాడకున్నా అన్నీ అర్పించింది
పెళ్లి చేసుకోమని అర్థించింది
అతడు కర్కోటకుడిగా మారాడు
తన కలలను బుగ్గి పాలు చేసింది కాక
వెంట తెచ్చుకున్న పెట్రోలుతో అగ్గి రాజేశాడు
అప్పుడర్థమయింది ప్రేమంటే... మంటని
ఇలాంటి మృగాళ్లను నమ్మితే మిగిలేది చావేనని

ప్రేమంటే!

బద్వేలు సమీపంలో శనివారం జరిగిన యువతి హత్యోదంతంలో నిందితుడు విఘ్నేష్‌ను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి యువతిని రప్పించి తన కోర్కె తీర్చిన తర్వాత పెట్రోలు పోసి నిప్పంటించినట్లు తేల్చారు.



మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని కడప ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

- గంటల వ్యవధిలోనే పట్టుబడ్డ నిందితుడు
- తప్పించునేందుకు నేరస్థుడి విశ్వ ప్రయత్నాలు
- ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

సంచలనం కలిగించిన ఇంటర్ విద్యార్థి కేసులో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకోగలిగారు. తప్పించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేసినా వలపన్ని పట్టుకున్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక దృష్టి సారించి ఘటనా స్థలానికి స్వయంగా వెళ్లడంతో పాటు సిబ్బందికి తగిన సూచనలు చేసి కేసును తక్కువ వ్యవధిలోనే ఛేదించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఘటన బాహ్య ప్రపంచానికి తెలిసింది. ఈ లోపు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలిని బతికించడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని ఆదేశించారు. నిందితుడిని వెంటనే పట్టుకోవాలని సూచించారు. బాలికకు స్థానికంగా చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పెట్రోలుతో తగులబెట్టిన కారణంగా బాధితురాలి శరీరం 80 శాతం వరకు కాలిపోయినట్లు వైద్యులు గుర్తించారు. చికిత్సకు కోలుకోలేని విద్యార్థిని ఆదివారం వేకువ జామున 2.30 గంటలకు ప్రాణాలు కోల్పోయింది. ఎస్పీ అందించిన సమాచారం మేరకు వివరాలివి...

లైంగిక దాడి... ఆపై పెట్రోల్ పోసి లైటర్‌తో కాల్చి

ఇంటర్ యువతిని ప్రేమించిన విఘ్నేష్ మరో మహిళను ఆరు నెలల కింద వివాహం చేసుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని ఆ యువతి తరచూ నిలదీస్తుండేదని పోలీసు విచారణలో నిందితుడు తెలిపారు. ఈ తరుణంలో బాలికను వదిలించుకోవాలనే ఎత్తుగడ వేశాడు. శనివారం ఉదయం ఫోన్ చేసి పీపీ కుంట ప్రాంతానికి రావాలని కోరడంతో పాటు రాకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో విద్యార్థిని నిందితుడు సూచించిన ప్రాంతానికి ఆటోలో వెళ్లింది. కడపలో హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్న విఘ్నేష్ ఈ లోపు ద్విచక్ర వాహనంలో బయలుదేరి ముందుగానే సీసాలో పెట్రోలు నింపుకొని జేబులో పెట్టుకుని వెళ్లారు. పీపీ కుంట ప్రాంతంలో అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తన పెళ్లి విషయమై విద్యార్థిని ప్రశ్నించడంతో తీవ్రంగా దాడి చేయడంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత పెట్రోల్ చల్లి నిప్పంటించి వెళ్లిపోయినట్లు నిందితుడు పోలీసుల ముందు అంగీకరించాడు. ఈ కేసు నుంచి తప్పించుకోవడానికి నిందితుడు విశ్వప్రయత్నాలు చేసినట్లు పోలీసు విచారణలో తేలింది. తన ఫోన్ తీసుకెళ్తే పక్షంలో కాల్‌డేటా, సిగ్నల్ ఆధారంగా గుర్తించే అవకాశం ఉంటుందని, దాన్ని కడపలో ఉంచి భార్య ఫోన్‌ను వెంట తీసుకెళ్లినట్లు గుర్తించారు. తన ఫోన్‌లోని కాల్ డేటాను తొలగించినట్లు తేలింది. ఆ తర్వాత పీపీ కుంట నుంచి కడప నగరానికి చేరుకున్న నిందితుడు జనంలో కలిసిపోయే ప్రయత్నం చేశారు. నాలుగు బృందాలతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజ్ పలుచోట్ల సేకరించారు. కడపలోని ఓ పెట్రోల్ బంకులో ద్విచక్ర వాహనానికి పెట్రోల్ నింపుకోవడం, సీసాకు ప్రత్యేకంగా పట్టుకోవడాన్ని గుర్తించారు. ఈ కోవలో కూపీ లాగగా వ్యవహారం బయటపడింది. నేరం జరిగిన ప్రాంతంలో పలు ఆధారాలు సేకరించారు. నిందితుడు, మృతురాలి బట్టలు, విద్యార్థిని తరగతి పుస్తకాలున్న బ్యాగు, సగం కాలిన పెట్రోల్ సీసా, ఘటనా స్థలంలో నిందితుడు తాగిపడేసిన సిగరెట్ పీక సేకరించారు. శనివారం రాత్రే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సాంకేతిక వివరాలన్నీ సేకరించిన తర్వాత ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ప్రత్యేక బృందాలు నిందితుడిని గంటల వ్యవధిలోనే పట్టుకోవడం, నేరం జరిగిన తీరును గుర్తించగలిగారు. పోలీసుల పనితీరును రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసించింది. ప్రత్యేకించి డీజీపీ ద్వారకా తిరుమలరావు అభినందించారు.

రిమ్స్‌లో విషాదం

రిమ్స్ మార్చురీ వద్ద విషాదం నెలకొంది. మృతురాలి తల్లి రోదన అందరి హృదయాలను కదిలించింది. విషాదంలో ఉన్న తల్లి బోరున విలపించింది. నిందితుడిని చంపేయాలంటూ పోలీసులను వేడుకుంది. లేదంటే తానే పెట్రోల్ పోసి చంపేస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఉపాధ్యాయ శిక్షణ వాయిదా వేయాలి




మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి

కడప విద్య, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకూ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించతలపెట్టిన శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ రెసిడెన్షియల్ పద్ధతి వల్ల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లిదండ్రులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. పాఠశాలల పనివేళల్లో శిక్షణ కార్యక్రమాలతో విద్యాబోధనకు తీవ్ర ఆటంకం కలుగుతుందని చెప్పారు. ఇలాంటివి వేసవి సెలవుల్లో నిర్వహించాలన్నారు. ముందుగా జిల్లాస్థాయిలో రీసోర్స్‌పర్సన్‌లకు శిక్షణ ఇచ్చి, వారి ద్వారా మండల స్థాయిలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ నిర్వహించాలని సూచించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామచంద్రారెడ్డి, మణికుమార్, మస్తాన్‌బాబు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ పునర్జన్మే శాస్త్రి

జిల్లా సాహితీ లోకానికి వరం జానమద్ది





పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, గండ్లూరి దత్తాత్రేయశర్మలను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, జానమద్ది కుటుంబీకులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: సీపీ బ్రౌన్ తాను తలపెట్టిన గ్రంథాలయ స్థాపన యజ్ఞాన్ని జానమద్ది రూపంలో పునర్జన్మ ఎత్తి నెరవేర్చారని... అలా సాహితీ లోకానికి బ్రౌన్ శాస్త్రిగా నామకరణం చేసుకుని జీవితాన్ని చరితార్థం చేసుకున్నారని వక్తలు కొనియాడారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు, గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, గండ్లూరి దత్తాత్రేయ శర్మలకు గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ హనుమచ్ఛాస్త్రి చేసిన సేవలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏటా సాహిత్య, గ్రంథాలయ సేవకులను పురస్కారంతో గౌరవించడం అభినందనీయమన్నారు. జానమద్ది రచయితగా సాహితీ సేవ చేస్తూనే మరోవైపు బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి తుదిశ్వాస వరకు కృషి చేశారని కొనియాడారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 2003లో కడపకు వచ్చినప్పుడు జానమద్దితో ఏర్పడిన పరిచయం ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. సాహితీవేత్తగా, కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పైనేని తులసీనాదం నాయుడు మాట్లాడుతూ.. హనుమచ్ఛాస్త్రి లాంటి మహోన్నతవ్యక్తుల ప్రేరణతో పుస్తకాలను ముద్రించి విద్యార్థుల్లో భాషా సాహిత్య స్పృహను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీత పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ... 1984లో తాను జానమద్ది హనుమచ్ఛాస్త్రిని కలిసిన విషయాన్ని గుర్తుచేస్తూ, తాను గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం వెనుక ఆయన ప్రేరణ కూడా ఉందన్నారు. మరో పురస్కార గ్రహీత, శతావధాన సామ్రాట్ గండ్లూరి దత్తాత్రేయ శర్మ ప్రసంగిస్తూ జానమద్ది పేరిట పురస్కారాన్ని పొందడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అలపర్తి పిచ్చయ్యచౌదరి, డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, ఇందిరా ప్రియదర్శిని, యలమర్తి మధుసూదనలను సత్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, సంస్థ కార్యదర్శి జానమద్ది యామిని, ఎల్.గోవిందరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, కొండూరి జనార్దరాజు, భూపతి రాయల్, శ్యామసుందర్‌రెడ్డి, రాజారెడ్డి, కరీముల్లా, కె.రామాంజనేయులు, డాక్టర్ తవ్వా వెంకటయ్య, వై.ప్రభాకరరెడ్డి, జానమద్ది అభిమానులు, సాహితీవేత్తలు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు. ● సాయంత్రం తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో నిర్వహించిన 'భువన విజయం' సాహిత్య రూపకం విశేషంగా అలరించింది.



6

ఉమ్మడి కడప జిల్లాలో ఏటా పిడుగుపాటుకు సరాసరి అయిదుగురు మృత్యువాత పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆరుగురు దుర్మరణం పాలయ్యారు.



పిడుగులు పడే ప్రాంతాల గురించి హెచ్చరిస్తూ 30 నిమిషాల ముందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ చరవాణులకు సందేశం పంపుతోంది. ఇందులో ఏఏ ప్రాంతంలో పిడుగులు పడనున్నాయో లోకేషన్‌తో సహా తెలుగు, ఆంగ్ల భాషల్లో సందేశం పంపుతున్నారు.



ఏటా సగటున వంద వరకు పశువులు పిడుగులతో జిల్లాలో మృత్యువాత పడుతున్నాయి.

- జిల్లాలో ఎక్కువగా రైతులు, పశువుల కాపర్లు, వ్యవసాయ కూలీలు పిడుగుపాటుకు మృత్యువాత పడుతున్నారు.
- నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నీ పిడుగు పాటుకు గురయ్యే అవకాశం ఉన్నా, పట్టణాలు, నగరాలతో పోలిస్తే గ్రామీణులే ఎక్కువగా బలవుతున్నారు.

పిడుగులపై పిడుగులు!

వర్షాల వేళ తస్మాత్ జాగ్రత్త ● అపార్ట్‌మెంట్లపై రక్షణ పరికరాలు తప్పనిసరి

జిల్లాలో పిడుగులు బెంబేలెత్తిస్తున్నాయి... కరవుకు మారుపేరు కావడంతో ఇక్కడ ఎండలదే పెత్తనం ఎక్కువ... అయినప్పటికీ అకాల వర్షాలు, తుపానులు, రుతుపవనాల సమయంలో పిడుగులు కబళిస్తున్నాయి. మృత్యువాత పడుతున్న వారంతా రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులే. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం బారి నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల పిడుగుపాటుకు ఉమ్మడి కడప జిల్లాలో అయిదుగురు మృత్యువాత పడగా ఆదివారం కంభంవారిపల్లెలో ఒకరు మృత్యువాత పడ్డారు.

కొన్ని ప్రమాద ఘటనల వివరాలివి

- సంబేపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన మహిళలు కూలి పనులకు వెళ్లి బావులకాడపల్లె వద్ద ఈ నెల 7న టమాటాలు కోసి గ్రేడింగ్ చేస్తుండగా వారిపై పిడుగుపడింది. ఈ ఘటనలో శంకరమ్మ (35), మల్లేశ్వరమ్మ (38) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఏడుగురు గాయపడ్డారు.
- వైఎస్ఆర్ జిల్లా పెండ్లిమర్రి మండలం తుమ్మలూరుకు చెందిన శివపార్వతి (30), తేజేశ్వర్‌రెడ్డి (10) ఈ నెల 3వతేదీ పశువులు మేపేందుకు వెళ్లారు. వర్షం రావడంతో చెట్టుకిందకు వెళ్లగా పిడుగుపడి ఇద్దరూ మృత్యువాతపడ్డారు. పగడాలపల్లెకు చెందిన మారుతీప్రసాద్‌రెడ్డి (30) పొలం పనులు చేస్తుండగా పిడుగుపడటంతో మృతి చెందారు. మరో వ్యక్తి షాక్‌కు గురై ఆసుపత్రి పాలయ్యాడు.
- మదనపల్లె మండలం వేంపల్లెకు చెందిన రైతు భాస్కర్‌నాయుడు (45) గతేడాది పొలం నుంచి గడ్డి మోపు తీసుకొస్తుండగా పిడుగుపాటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.
- రెండేళ్ల కిందట మదనపల్లె పట్టణ శివారు ఈశ్వరమ్మ కాలనీ సమీపంలోని ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడేందుకు కొంత మంది యువకులు వెళ్లారు. ఆడుకుంటున్న సమయంలో వీరు ఉన్న ప్రాంతానికి సమీపంలోనే పిడుగు పడింది. ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.
- ఆదివారం పిడుగుపాటుకు గాలివీడు మండలంలోని తూముకుంట పంచాయతీ నాయునివారిపల్లె సమీపంలో 18 పొట్టేళ్లు, కంభంవారిపల్లెలో రెండు పాడిఆవులు చనిపోయాయి.

బహుళ అంతస్తులకు తప్పనిముప్పు

జిల్లాలో గతంలో కంటే ప్రస్తుతం ఎక్కువగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం కొనసాగుతోంది. ఒక్క మదనపల్లెలోనే వందకు పైగా బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 500కు పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటి నిర్మాణాలు చేస్తున్నప్పటికీ వాటికి సరైన భద్రత పాటించడం లేదు. దీని వల్ల ఎత్తులో ఉన్న ఈ భవనాలపై పిడుగు పడే అవకాశాలున్నాయి. రానున్న రోజుల్లో పిడుగుపాటు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో రాయచోటి, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో ఏ పట్టణంలో చూసినా వంద వరకు బహుళ అంతస్తులు ఉన్నాయి.

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వర్షాకాలం వచ్చిందంటే పిడుగుల ప్రభావంతో ఏటా అనేక మంది మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం తుపాను జిల్లాను కమ్మేయడంతో పిడుగుల భయం వెంటాడుతోంది. వర్షాకాలంతో సంబంధం లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు అకాల వర్షాలు కురుస్తుండటంతో పాటు పిడుగులు పడుతుండటంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. ప్రకృతి కన్నెర్ర చేస్తుండటంతో కూలీలు, రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు దిక్కుతోచని స్థితిలో దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు. తాజాగా కంభంవారిపల్లెలో పిడుగుపాటుకు మరొకరు దుర్మరణం పాలవడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.



భవంతిపై ఏర్పాటు చేసిన లైటెనింగ్ కండక్టర్

లైటెనింగ్ కండక్టర్లతో రక్షణ

ఎత్తైన భవనాలు, పెద్ద చెట్లు పిడుగులను ఎక్కువగా ఆకర్షిస్తాయి. భవన నిర్మాణ సమయంలో నిబంధనలు పాటించాలి. ఎత్తైన భవనాలపై తప్పనిసరిగా లైటెనింగ్ కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో పొడవాటి రాగి, ఇత్తడి తీగను భవనం పైభాగాన అమర్చాలి. దాన్ని భూమికి కనెక్షన్ ఇవ్వడం వల్ల విద్యుత్తు తరంగాలను ఆకర్షించి పిడుగుల ప్రభావం భవనాలపై పడకుండా భూమిలోకి పంపుతుంది. దీని వల్ల పిడుగుల నుంచి రక్షణ పొందవచ్చునని నిపుణులు అంటున్నారు.

భర్తను బలితీసుకున్న పిడుగు
భార్య, తల్లికి గాయాలు



కంభంవారిపల్లి: మండలంలోని నూతనకాలవ పంచాయతీ గుట్టలపై ఆదివారం సాయంత్రం పిడుగుపాటుతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నడింపల్లెకు చెందిన **నాగరాజ** (48) ఆదివారం సాయంత్రం భార్య పార్వతమ్మ, తల్లి చిన్నక్కతో కలిసి గ్రామానికి సమీపంలో వేరుసెనగ పొలంలో పనిచేస్తుండగా వర్షం వచ్చింది. తడవకుండా ఉండటానికి సమీపంలో ఉన్న చింతచెట్టు కిందకు వెళ్లారు. ఈ సమయంలో పిడుగు పడడంతో నాగరాజ అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన పార్వతమ్మ, చిన్నక్కలను తిరుపతి ఆసుపత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. పీలేరు ఆసుపత్రిలో నాగరాజ మృతదేహానికి నివాళులర్పించారు. గాయపడిన వారిని పరామర్శించి మెరుగైన చికిత్స అందివ్వాలని వైద్యులను ఆదేశించారు. ఇదే మండలంలోని తువ్వపల్లె పంచాయతీ చెంచురెడ్డిగారిపల్లెలో రెండు పాడిఆవులు కూడా పిడుగు పడి చనిపోయాయి.

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగావకాశాలపై అవగాహన నేడు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: ఎన్‌వైకే, స్టెప్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, మధ్యాహ్నం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో 'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - ఉద్యోగావకాశాలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వింగ్ కమాండర్ గురుప్రీత్ అత్వాల్, కమాండింగ్ అండ్ రిక్రూటింగ్ ఆఫీసర్ ఎన్. సందీప్ పేర్కొన్నారు. 17 నుంచి 21 ఏళ్ల వయస్సు గల జిల్లాలోని డిగ్రీ, ఇంజినీరింగ్ చదుతున్న కళాశాల విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టెప్ సీఈవో సాయిగ్రేస్, ఎన్‌వైకే జిల్లా అధికారి మణికంఠ పేర్కొన్నారు.

పుష్పగిరిని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న పుష్పగిరి మఠం సిబ్బంది

వల్లూరు, న్యూస్‌టుడే : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ ఆదివారం పవిత్ర పుణ్య క్షేత్రం పుష్పగిరిని సందర్శించారు. క్షేత్రాధిపతి శ్రీవైద్యనాథేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వైద్యనాథేశ్వరస్వామి, శ్రీచక్రసహిత కామాక్షిదేవిలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పగిరి పీఠం(మఠం)ను సందర్శించారు. పీఠం సభ్యులు జ్ఞాపికను అందచేసి తీర్థప్రసాదాలను అందించారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది పీఠం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యమేదీ?

కడప, గ్రామీణ, చిన్నచౌకు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా, ఇప్పటి వరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీ నెరవేర్చలేదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని కోరుతూ ఆదివారం కడపలో ఆమె బస్సులో టిక్కెట్టు కొని ప్రయాణిస్తూ నిరసన వ్యక్తం చేశారు. విజయజ్యోతి మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలు చేశాయని గుర్తుచేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పోస్టు కార్డు పంపిస్తున్నామని తెలిపారు. శ్యామల, బండి జకరయ్య, సునీల్‌కుమార్, సయ్యద్ సలావుద్దీన్, గౌస్‌పీర్ తదితరులున్నారు.


బస్సులో టిక్కెట్టు చూపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి

సలాం పోలీస్

నేటి నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు


పోలీసు అమరవీరుల స్తూపం

న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

సమాజంలో శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలంటే పోలీసుల పాత్ర చాలా కీలకం. అసాంఘికశక్తులను తుదముట్టించడంలో ఎప్పుడూ ముందుంటారు. అసలు వారు లేని సమాజాన్ని ఊహించుకోలేం. ప్రాణత్యాగంలో కూడా పోలీసులే ముందుంటారు. దేశసరిహద్దుల్లో సైనికులు శత్రువుల నుంచి దేశాన్ని రక్షిస్తుంటారు. దేశంలో అంతర్గతంగా సమాజంలో రౌడీలు, గుండాల నుంచి పోలీసులు ప్రజలను కాపాడుతుంటారు. ఏదైనా సమస్య వస్తే ప్రజలు నేరుగా పోలీసు స్టేషన్‌కే వెళతారంటే వారికి ఉన్న నమ్మకం అలాంటిది. ప్రజల కోసం ప్రాణాలు అర్పించడంలో పోలీసులు ముందు వరుసలో ఉన్నారు. ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తారు.


రాత్రింబవళ్లు విధి నిర్వహణ

జిల్లా వ్యాప్తంగా 52 పోలీసు స్టేషన్లు ఉన్నాయి. 1624 మంది సివిల్, 584 మంది ఏఆర్ పోలీసులు, 700 మంది హోంగార్డులు జిల్లాను అనునిత్యం రక్షిస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసుల పాత్ర కీలకం. రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తుంటారు. అర్ధరాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరిగినా, ఎవరైనా హత్యకు గురైనా అందరి కంటే ముందు అక్కడికి వస్తారు. అనేకమంది సిబ్బంది ప్రజల కోసం ప్రాణాలు కూడా కోల్పోయిన వారు ఉన్నారు. 2005లో శేషాచలం అడవుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో కడపకు చెందిన ఏఆర్ఎస్సై నరసింహులు మావోయిస్టుల తూటాలకు బలయ్యారు. ఆయన వీరమరణాన్ని ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీసులు గుర్తు చేసుకుంటారు. చాలా మంది పోలీసులు విధుల నిర్వహణలో, అనారోగ్యంతో మృతి చెందారు. వారికి కూడా నివాళులర్పిస్తారు.

ప్రత్యేక ఏర్పాట్లు

పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తారు. వారు ఉపయోగించే ఆయుధాల గురించి ప్రజలకు తెలియజేస్తారు. పోలీసులు ధరించే దుస్తులు, హోంగార్డు నుంచి డీజీపీ వరకు వేసుకునే యూనిఫారాలు, ఓపెన్‌హౌస్‌లు, విద్యార్థులకు, పోలీసులకు వ్యాసరచన పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సమాజంలో పోలీసుల కీలక పాత్ర



అనునిత్యం ప్రజల కోసం 24 గంటల పాటు పని చేసేది పోలీసులే. సమాజంలో వారి పాత్ర కీలకం. ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఠాణాల పరిధిలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. వారి విధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన తీసుకొస్తాం.

- హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ, కడప

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘం నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: బద్వేలులో బాలికపై పెట్రోల్ పోసి కాల్చి చంపిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని, బాధిత విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, మనోహర్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సుబ్బన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండు చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ దేశంలో బలమైన చట్టాలు లేకపోవడంతో నిత్యం మహిళలపై, విద్యార్థులపై అనేక రూపాల్లో దాడులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. బాధితురాలి కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కడప ఏడురోడ్లు: ఇంటర్ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పంటించి హత్య చేసిన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని ఆదివారం సాయంత్రం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. వెంకటేష్, ధనుంజయ, సాయికుమార్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రి: దూదేకుల సంఘం పెద్దలు రిమ్స్ మార్చురీ వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. మృతి చెందిన బాలిక కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని, ఆమె కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం చెల్లించి, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.

అరవిందనగర్ (కడప): బద్వేలు నియోజకవర్గంలో విద్యార్థినిపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కడప ఎమ్మెల్యే మాధవి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థినిపై పెట్రోల్ పోసి హత్యకు పాల్పడిన మానవమృగాన్ని కఠినంగా శిక్షించాలన్నారు. వైకాపా ఐదేళ్ల కాలంలో మాదక ద్రవ్యాలు విచ్చల విడిగా లభించాయని, వాటిని నియంత్రించడంలో ఆ పార్టీ నేతలు విఫలమయ్యారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేశారని, నిందితునికి కఠిన శిక్షపడేలా చూడాలని కోరారు.

తెదేపా నగర అధ్యక్షుడికి పలువురి పరామర్శ


శివకొండారెడ్డిని పరామర్శిస్తున్న పుత్తా నరసింహారెడ్డి, సుంకర శ్రీనివాస్

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: దుండగుల దాడిలో గాయపడి కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెదేపా నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిని ఆదివారం తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, జనసేన పార్టీ నాయకుడు సుంకర శ్రీనివాస్ పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.

కడప, చిన్నచౌకు: శివకొండారెడ్డిపై దాడి దుర్మార్గమని భాజపా రాష్ట్ర నాయకులు బాలక్రిష్ణయాదవ్ ఖండించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డిని ఆదివారం పరామర్శించారు. దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. తెదేపా నాయకులు కట్ల రమేష్, కృష్ణారెడ్డి ఉన్నారు.

దుండగుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు

కడప నేరవార్తలు: కడప చిన్నచౌకు ఠాణాపరిధిలో రెండు రోజుల కిందట తెదేపా నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడి చేసిన దుండగుల కోసం ప్రత్యేకంగా నాలుగు పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. సీసీ పుటేజీల్లో ఉన్న వారిలో ఒకరిని గుర్తించామని, అతని కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఘటన వెనుక ఎవరున్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి పురస్కారం


ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, తదితరులు

వేంపల్లె, న్యూస్‌టుడే: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ రసాయనశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్‌ను ఏపీజే అబ్దుల్‌కలామ్ జాతీయ ప్రతిభా అవార్డు వరించింది. ఈ మేరకు గుంటూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు చేతుల మీదుగా అధ్యాపకుడు అవార్డును అందుకున్నారు. విద్యార్థులకు ఈయన అందించిన సేవలను గుర్తించి అవార్డును అందజేశారు.

21 నుంచి డిగ్రీ ఒకేషనల్ పరీక్షలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలలో నాలుగేళ్ల యూజీ ఆనర్స్ ఒకేషనల్ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎంఎల్‌టీ, డెయిరీ సైన్స్ చదివే విద్యార్థులు హాజరు కావాలన్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను కళాశాల నుంచి పొందాలని సూచించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని చెప్పారు.

రాష్ట్రంలో పడకేసిన పారిశుద్ధ్యం

వేంపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పారిశుద్ధ్యం పడకేసిందని, శాంతిభద్రతలు క్షీణించాయని మాజీ ఎంపీ, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొన్ని నెలలుగా విషజ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని, ప్రస్తుతం డయేరియాతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సనాతన ధర్మం గురించి మాట్లాడటం మానుకుని ధర్మంపై దృష్టిపెట్టాలని కోరారు. ఆరోగ్యశాఖా మంత్రి స్పందించి ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టాలన్నారు. రాష్ట్రంలో బాలికల, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలి

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే మానవతా ధర్మమని, విలువలు కలిగిన వ్యక్తులందరినీ ఒక చోట చేర్చి సమాజానికి సేవ చేయడమే తమ లక్ష్యమని మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంస్థ సభ్యత్వ నమోదులో కడప నగరం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. డాక్టర్ ఎంసీ వెంకటసుబ్బయ్య మానవత సంస్థ సేవలకు రూ.లక్ష చెక్కు అందజేశారు. అనంతరం ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుతున్న నిహిత్ అనే విద్యార్థి తల్లిదండ్రులకు రూ.10 వేల చెక్కును అందించారు. సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్లు రాటాల గోపి, డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, సంస్థ అధ్యక్షులు బైరెడ్డి విష్ణుశివమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.సుబ్బారెడ్డి, కమిటీ ఛైర్మన్ పి.సుబ్రహ్మణ్యం, కళాశాల కరస్పాండెంట్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


రూ.లక్ష చెక్కును మానవతా సంస్థ ప్రతినిధులకు అందజేస్తున్న డాక్టర్ ఎంసీ వెంకటసుబ్బయ్య

జూనియర్ ఫారెస్టు అధికారుల సంఘం ఎన్నిక


సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం మధ్యాహ్నం కడప డీఎఫ్‌వో కార్యాలయంలో జరిగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు పర్యవేక్షించారు. కడప యూనిట్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, వ్యవస్థాపక కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీలు జరగగా, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ కడప డివిజన్ యూనిట్ అధ్యక్షుడుగా శ్రీపతి ఓబులేసు, ఉపాధ్యక్షుడిగా ఎస్.రాజశేఖర్‌రాజు, కార్యదర్శిగా శ్రీనివాసులు, వ్యవస్థాపక కార్యదర్శిగా భరణికుమార్, సంయుక్త కార్యదర్శిగా షాహినా భాను, కోశాధికారిగా విశ్వనాథ్ ఎన్నికయ్యారు.

ప్రొద్దుటూరులో...

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు రాజీవ్ గాంధీ జాతీయ పార్కులో ఆదివారం ఏపీ జూనియర్స్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారులుగా కడప, చిత్తూరు ఎఫ్‌బీవోలు ఎస్.రాజశేఖర్‌రాజు, కె.ప్రతాప్ వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు (ప్రొద్దుటూరు డీఆర్వో), సంయుక్త కార్యదర్శిగా ఎస్డీ.మున్నాఫ్ (ఏబీవో, బద్వేలు) ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కార్యదర్శి పదవికి పోటీ పడిన జి.వి.రమణ, ఖాజా చెరో ఒక్కటిన్నర సంవత్సరం పంచుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కరుణాకర్ (ఎఫ్‌బీవో, పోరుమామిళ్ల), కోశాధికారిగా ఎన్.పద్మనాభయ్య (ఎఫ్‌బీవో, ముద్దనూరు) గెలుపొందారు.

టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం ఎన్నికలు

గుంటూరు(జిల్లాపరిషత్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ప్రశాంతంగా జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా జి.మోహన్‌గోపాలకృష్ణ (రాష్ట్ర సచివాలయం), ప్రధాన కార్యదర్శిగా బి.సి.శంకర్‌నాయక్ (కర్నూలు జిల్లా) ఎన్నికయ్యారు. క్రీడా కార్యదర్శిగా యు.ప్రవీణ్‌కుమార్ (వైఎస్ఆర్)లను ఎన్నుకున్నారు.

రచయితల మహాసభలకు ఆహ్వానం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో జరగనున్న జిల్లా రచయితల మహాసభలకు తెలుగు భాషా సేవకులు, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కడప ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో బుద్ధప్రసాద్‌ను కలిశారు. ఆయన సానుకూలంగా స్పందించి తప్పకుండా వస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. సంస్థ ప్రధానకార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహాసభలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర మాజీ సలహాదారు రమణాచారిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గౌరవ సలహాదారు పిచ్చయ్య చౌదరి, కోశాధికారి కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతమే ధ్యేయం


మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్, భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తదితరులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భాజపా అవతరించిందని రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. కడప ఎన్జీవో కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. పది కోట్ల సభ్యత్వాన్ని లక్ష్యంగా ఎంచుకున్నామని చెప్పారు. మోదీ హయాంలో రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, చలపతి, మురళీమోహన్‌రెడ్డి తదితరులున్నారు.

డయల్ 100, 112 సేవలు సద్వినియోగం చేసుకోండి

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: జిల్లా ప్రజలు డయల్ 100, 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ నంబర్లు పని చేయడం లేదంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని ఖండించారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

కడప విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం సంఘ స్వర్ణోత్సవ జిల్లా మహాసభ నిర్వహించారు. అంతకుముందు కోటిరెడ్డికూడలి నుంచి యర్రముక్కపల్లె కూడలి, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ అందరికీ సమాన అవకాశాలు ఉండాలనే ఉద్దేశంతో యూటీఎఫ్‌ను పెద్దలు ఏర్పాటుచేశారన్నారు. హక్కుల కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పోరాటం చేశామని చెప్పారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ పీఆర్సీ ఉద్యమంలో యూటీఎఫ్ ముందుభాగాన ఉందని పేర్కొన్నారు. కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ సేవలు అభినందనీయమన్నారు. ఎంఈవోలు గంగిరెడ్డి, రమాదేవి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు రవి, శివకుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు షామీర్‌బాషా, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధాతప్త హృదయాలతో తుది వీడ్కోలు

బద్వేలు, గోపవరం, న్యూస్‌టుడే: స్నేహితుడి ముసుగులో ఉన్న విఘ్నేష్ చేతిలో పెట్రోల్ దాడికి గురై తీవ్రంగా గాయపడి మృతిచెందిన బాలిక (16)కు బద్వేలు మండలంలోని ఓ ప్రాంతంలో రక్త సంబంధికులు, బంధువులు, నాయకులు బాధాతప్త హృదయాలతో ఆదివారం తుది వీడ్కోలు పలికారు. తీవ్రంగా గాయపడిన బాలిక చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుఝామున కడపలోని రిమ్స్‌లో మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు ప్రత్యేక వాహనంలో సాయంత్రం బంధువులకు అప్పగించారు. చివరి సారిగా బాలికను చూసేందుకు బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. అందరితో కలివిడిగా మాట్లాడుతూ మంచిగా ఉన్న బాలికను ప్రేమ పేరుతో వేధించి పెట్రోలు పోసి కాల్చివేసిన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో అందరూ నినదించారు.

ముగిసిన ఓపెన్ సైట్ క్యాటగిరీ

రాజానగరం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం సంపతనగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఓపెన్‌సైట్ క్యాటగిరీలు ఆదివారం ముగిశాయి. ఎస్‌జీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి విజేతల వివరాలను వెల్లడించారు. ఈ క్యాటగిరీలో ఓవరాల్ ఛాంపియన్స్‌గా అనంతరపురం, కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాలు నిలిచాయని ఆయన అన్నారు. అండర్-19 బాలికల విభాగంలో.. వైఎస్ఆర్, కృష్ణా జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాలుర విభాగంలో.. అనంతపురం, వైఎస్సాఆర్ జిల్లాలు వరుసగా ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించాయి. వీరికి డివైఈవో నారాయణ బహుమతులు అందజేశారు.

చెట్ల పొదల్లో ఎర్ర కూలీల సామగ్రి


అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో చెట్ల పొదల్లో బట్టల సంచులు

అట్లూరు, న్యూస్‌టుడే : అట్లూరు క్రాస్‌రోడ్డులో ఆదివారం తెలుగుగంగ కాలువ సమీపంలోని చెట్ల పొదల్లో తమిళ కూలీలకు సంబంధించిన దుస్తులు, సంచులను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. చెట్ల మధ్య కూలీలకు సంబంధించిన సుమారు 8కి పైగా సంచులు, టార్చ్‌లైట్లు, నీళ్ల సంచులు, హోటల్‌లో తెచ్చుకున్న అన్నం ప్యాకెట్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. తమిళ కూలీలు అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో బసచేసి రాత్రిళ్లు లంకమల అభయారణ్యంలో ఎర్రచందనం చెట్లు నరికేందుకు వెళ్లినట్లు సమాచారం. గతంలో పలుసార్లు తమిళ కూలీలు అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో బసచేసి ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడ్డ సంఘటనలు బట్టబయలయ్యాయి. తమిళ భాషలోని పేర్లతో ఉన్న సంచులు కూడా అక్కడ వదిలివెళ్లారు. సంఘటనా స్థలానికి అటవీశాఖ రేంజర్ కళావతితో పాటు అట్లూరు పోలీసులు పరిశీలించి వెంటనే అటవీశాఖ సిబ్బంది అటవీ ప్రాంతానికి తమిళ కూలీలను గుర్తించేందుకు తరలివెళ్లారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో లక్ష్య క్రీడాకారులకు పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు అనిల్

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి 35వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' క్రీడాకారులు పతకాలు సాధించి సత్తాచాటారు. మెడ్లే రిలే అంశంలో బి.సాయి, శ్రీలతారెడ్డిలు కాంస్యపతకాలు, హైజంప్ విభాగంలో తేజేశ్వర్‌రెడ్డి వెండి పతకం సాధించారు. ఈ ముగ్గురు ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిశాలో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని శిక్షకులు అనిల్ పేర్కొన్నారు.

కర్నూలు, విశాఖ, తూ.గో.లకు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం


కార్తీక్ దినేష్ ప్రఖ్యాత్ రక్షణ్‌సాయి

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కర్నూలు, పశ్చిమగోదావరి మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగియగా, కర్నూలు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంలో నిలిచింది. చివరి రోజు మొదటి ఇనింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు 51.5 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటయింది. రుత్విక్‌కళ్యాణ్ 45 పరుగులు చేయగా, జీతేష్, కార్తీక్‌వర్మ, కేపీ నారాయణ తలా 2 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప.గో. జట్టు ఆట ముగిసే సమయానికి 57.4 ఓవర్లలో 152/4 స్కోరు చేసింది. కేపీ.నారాయణ 67, సాయి మణికంఠ 25 పరుగులు చేశారు. వివేక్ 4, జగదీష్, వెంకటకార్తీక్ చెరో 2 వికెట్లు తీశారు. ప.గో మొదటి ఇన్నింగ్స్: 98

◆ కేవోఆర్ఎం మైదానంలో తూర్పుగోదావరి, ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగియగా, తూ.గో మొదటి ఇనింగ్స్ ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 112/6తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన తూ.గో. 123 పరుగులకు ఆలౌటయింది. దినేష్ 4 వికెట్లతో రాణించాడు. మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం 53.3 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటయింది. రాజమోహన్ 55 పరుగులు చేయగా, జి.కార్తీక్ 4, షాహిద్ 3 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన తూ.గో జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 111/3 స్కోరు చేసింది. కార్తీక్ 72 పరుగులు చేయగా, దినేష్ 2 వికెట్లు తీశారు.

◆ కేఎస్ఆర్ఎం మైదానంలో చిత్తూరు, విశాఖ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగియగా, విశాఖ మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. టాస్ గెలిచి ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ 51.3 ఓవర్లలో 196 పరుగులు చేసింది. ప్రణవ్‌శ్రీరామ్ 47, ప్రఖ్యాత్‌వర్మ 39 పరుగులు చేయగా, రక్షణ్‌సాయి 4, ఆశిష్‌రెడ్డి 3 వికెట్లు తీశారు. మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు 35 పరుగులకే ఆలౌటయింది. విశాఖ బౌలర్లు పి.ప్రఖ్యాత్ వర్మ 4, లోహిత్‌రాఘవేంద్ర 3 వికెట్లు తీశారు.

ప్రొద్దుటూరు
● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

తొలగిన పిచ్చిమొక్కలు



మైదుకూరు: ఆరోగ్య కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను శెట్టివారిపల్లెకు చెందిన తెదేపా నాయకులు తొలగించారు. పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. 'ఆరోగ్య కేంద్రం.. పరిశుభ్రత కనం' శీర్షికతో 'ఈనాడు'లో ఈనెల 12న ప్రచురితమైన కథనానికి ఆ పార్టీ నాయకులు పొలిమేర రాజగోపాల్‌రెడ్డి, పొలిమేర శివశంకర్‌రెడ్డి పొక్లెయిన్‌తో పిచ్చి మొక్కలను తొలగించారు.

చేతిపంపులపై చులకనెందుకు?
మరమ్మతుకు గురైతే అంతే సంగతులు

–న్యూస్‌టుడే, చాపాడు

గ్రామీణ ప్రాంతాల్లో చేతిపంపుల నీటిని తాగుతూ వాటిని వినియోగిస్తున్నారు. విద్యుత్తు అవసరం లేకుండా అత్యవసరాలకు ఇవి బాగా పనిచేస్తాయి. తాగేందుకు నీరు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటాయని పల్లె ప్రజలు వీటిపై మక్కువ చూపుతారు. మండలంలో బోరింగులు దెబ్బతిందంటే అంతే సంగతులు. వాటి మరమ్మతులకు ఆ శాఖ సిబ్బంది పట్టించుకోరు. చాలా గ్రామాల్లో ఎక్కువ బోరింగులు పనిచేయకుండా వాటిని అధికారులే కండం చేశారని విమర్శలున్నాయి. భద్రిపల్లె బస్టాపు వద్ద తాగునీటి బావి ఉండేది. ప్రతి వాహన చోదకులు అక్కడ సీసాలతో నీరు పట్టుకుని వెళ్లేవారు. రోడ్డు విస్తరణలో బావి పూడ్చగా ఆ స్థానంలో వేసిన బోరింగు నుంచి చాలా మంది తాగునీరు పట్టుకునేవారు. గత ఆరు నెలలుగా చేతిపంపు పనిచేయలేదని స్థానికులు సమస్య అధికారుల దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం లేదు. భద్రిపల్లె పంచాయతీలో మూడు చేతిపంపులు మరమ్మతులకు నోచుకోలేదు. అల్లాడుపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేయలేదు. చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చాలా ఏళ్లుగా రోగులకు సౌకర్యవంతంగా ఉన్న పంపు దెబ్బతినగా ఏకంగా రాళ్లువేసి పూడ్చేశారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్‌హుసేన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా దెబ్బతిన్న బోరింగులను వెంటనే మరమ్మతు చేయిస్తామని చెప్పారు.


భద్రిపల్లెలో మరమ్మతుకు నోచుకోని చేతిపంపు వద్ద అధికారులు

?: మైదుకూరులో బద్వేలురోడ్డు నుంచి వాసవీనగర్‌లోకి ప్రవేశించే ప్రాంతంలో సిమెంట్‌రోడ్డుపైకి మురుగునీరు చేరకుండా కాలువలో పూడికతీత చేపట్టాలి? -కరీముల్లా, మైదుకూరు

✔: పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువ పూడికతీత చేపట్టి వీధిలోకి మురుగు చేరకుండా చర్యలు తీసుకుంటాం. -పెంచలప్ప, పారిశుద్ధ్య విభాగ అధికారి, పురపాలక -న్యూస్‌టుడే, మైదుకూరు

?: కాలనీలో చాలా రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదు. చీకటి పడిందంటే భయానక వాతావరణం నెలకొంటోంది. అంధకారంలోనే కాలం గడుపుతున్నాం. ఎవరూ పట్టించుకోక సమస్య అలాగే ఉంది? -సుబ్బయ్య, అనంతపురం ఎస్సీ కాలనీ

✔: పనిచేయని వీధి దీపాలను గుర్తించాం వాటి స్థానంలో త్వరలో కొత్తవి అమర్చేలా చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసులరెడ్డి, కార్యదర్శి ఎన్.ఓబాయపల్లె -న్యూస్‌టుడే, చాపాడు

?: బద్వేలులోని మహబూబ్‌నగర్‌లో మురుగు కాలువ పూడిపోయింది. -అల్లాబకస్, మహబూబ్‌నగర్, బద్వేలు

✔: మహబూబ్‌నగర్‌లో కాలువలో పూడిక తీయిస్తాం. -లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, బద్వేలు -న్యూస్‌టుడే, బద్వేలు

అస్తవ్యస్తంగా రహదారులు... పొంగుతున్న కాలువలు

–న్యూస్‌టుడే, జమ్మలమడుగు


వినాయక నగర్‌లోని ఓ ప్రైవేటు స్థలంలో నిలిచిన మురిగునీరు

జమ్మలమడుగు నగర పంచాయతీలో సుమారు 53 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. అందుకు తగ్గట్టు రహదారులు, కాలువల్లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల కాలువలు చిన్నవిగా ఉండడంతో వానా కాలంలో నీరు పారక రోడ్లపై నిలిచిపోతున్నాయి. మెయిన్ బజారు, గూడుమస్తాన్‌వలి దర్గా ప్రాంతాల్లో ఎప్పుడో వేసిన పాత ఇనుప పైపులైన్‌లే ఇంకా ఉన్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సైతం పద్మవ్యూహంలా మారింది. తాడిపత్రి, ప్రొద్దుటూరు, ముద్దనూరురోడ్లలో నడకదారులు ఆక్రమణకు గురి కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. నగర పంచాయతీ పరిధిలోని 11 నుంచి 20 వార్డుల్లో ప్రజలు అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు.

చైర్‌పర్సన్ సొంత వార్డులో సమస్యల తిష్ఠ

పట్టణంలోని 11వ వార్డులో రామకృష్ణ కాలనీ, ఎత్తువారి కాలనీలున్నాయి. సరైన మురుగు కాలువల్లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ సొంత వార్డు 12లో సమస్యలు తిష్ఠవేశాయి. ఇరుకు కాలువలతో మురుగు పారక.. వానా కాలంలో అవి పొంగి ఇళ్ల ముంగిటకు వస్తున్నాయి. ఎత్తువారి కాలనీ, ఎల్ఐసీ వెనుక వీధి, సాయిబాబా ఆలయం తదితర వీధులు వస్తాయి. ఎప్పుడో పాత కాలంనాటి సిమెంటు రోడ్లే ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదు. 13వ వార్డులో నీళ్ల ట్యాంక్ ఏరియా, రోజా టవర్స్, మార్కెట్ వీధి, బ్యాంకు కాలనీ, వినాయక నగర్ ప్రాంతాలు వస్తాయి. ప్రైవేటు స్థలాల్లో మురుగు నిలిచి దోమలకు నిలయంలా మారాయి. మార్కెట్ వీధిలో సీసీ రోడ్లు ఛిద్రమై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. 14వ వార్డులోని దిగువ పట్నం, నెహ్రూనగర్‌లో వీధుల్లో కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. 15వ వార్డులో పీకే రామయ్య వీధి, గంగమ్మ దేవాలయం వెనక వైపు ప్రాంతాలు ఉన్నాయి. రహదారులు, కాలువలు పూర్తిస్థాయిలో లేవు. 16వ వార్డులోని కోటవీధి, ఈడిగపేట, దొరసానిచేనువీధిలో నీటి సమస్య వేధిస్తోంది. 17వ వార్డులో కుండావారి వీధి, చాకలి వీధి, మిఠాయిగిరిలో సరైన రహదారులు లేవు. 18వ వార్డులోని చిన్న బసప్ప వీధి, కుమ్మరి, చాకలి వీధుల్లో కాలువల సమస్యతో స్థానికులు గొడవ పడుతున్నారు. 19వ వార్డులోని గడ్డవీధి, రంగరాజుల వీధి, మార్వాడి వీధి, 20వ వార్డులోని డొంకవీధి, గూడుమస్తాన్ వలి దర్గా వీధి, టెక్కాయచేను వీధుల్లో సిమెంటు రోడ్లు దాదాపుగా ధ్వంసమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలువలు కూడా లేవని వాపోతున్నారు.

రహదారి, కాలువలు ఏర్పాటు చేయాలి



కాలువలు లేవు. సిమెంటు రోడ్డు తక్కువ ఎత్తులో ఉన్నందున వానా కాలంలో ఇబ్బంది పడుతున్నాం. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ఇళ్లలోకి చేరితే తోడుకున్నాం. మా వీధిలో ఎప్పుడూ డ్రైనేజీ నీరు నిలిచే ఉంటుంది. -వెంకటలక్ష్మమ్మ, 12వ వార్డు

సుందరీకరణకు కృషి

పట్టణ సుందరీకరణకు కృషి చేస్తున్నాం. సుమారు రూ.30 కోట్లు అవసరమవుతాయని ప్రాథమిక అంచనా. వీటితోపాటు పెన్నా నది, మైలవరం ఉత్తర కాలువలో ఇళ్లలోని మురుగునీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాం. మురుగునీటిని శుద్ధి చేసే ప్రాజెక్టుకు స్థలం సేకరించాం. త్వరలోనే అన్ని అభివృద్ధి పనులు చేపడతాం. -వెంకటరామిరెడ్డి, కమిషనర్, జమ్మలమడుగు నగర పంచాయతీ

విపంచిక ఖండ కావ్యం పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక గీతాశ్రమంలో ఆదివారం డాక్టర్ పెరుగు భవాని శంకర్ రచించిన విపంచిక ఖండ కావ్యం పుస్తకావిష్కరణ చేశారు. డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెంగల వీరాంజేయులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బుర్రి సుబ్బరాయుడుయాదవ్, మారెళ్ల మల్లికార్జునరావు, పుస్తక రచయిత తదితరులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ చేస్తున్న నిర్వాహకులు

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి


రికార్డులను పరిశీలిస్తున్న అమీరుద్దీన్

చాపాడు, న్యూస్‌టుడే: విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు గ్రంథాలయాల్లోని పత్రికలు, విలువైన సమాచారంతోకూడిన పుస్తకాలను చదివి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సయ్యద్ అమీరుద్దీన్ తెలిపారు. ఆదివారం చాపాడు గ్రంథాలయాన్ని కార్యదర్శి పరిశీలించారు. పాఠకుల సంఖ్య, సభ్యత్వ నమోదు పెంచాలని లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డికి సూచించారు.

నిధుల్లేక... భవనాల నిర్మాణం కాక
విద్యార్థులను వెంటాడుతున్న తరగతి గదుల కొరత


పునాదులతో అసంపూర్తిగా టేకూరుపేట పాఠశాల భవనం


ఆరుబయట పాఠాలు వింటున్న విద్యార్థులు

–న్యూస్‌టుడే, పోరుమామిళ్ల

గత ప్రభుత్వం నాడు- నేడు కింద ఉన్న శిథిలావస్థ భవాలను కూల్చివేసింది. రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టింది. తరగతి గదులు అందుబాటులో లేక పోరుమామిళ్ల మండలంలోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టేకూరుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు 416 మంది ఉన్నారు. ఈ పాఠశాలకు ఇరువైపులా 5 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల నుంచి విద్యార్థులు రాకపోకలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రూ.17 లక్షల మేర నిధులు మంజూరయ్యాయి. పాత భవనాలను కూల్చివేసి వాటి స్థానంలో కొంత భవనాలకు పునాదులు వేశారు. తర్వాత నిధులు మంజూరు కాకపోవడంతో భవనం పునాది దశలోనే ఉంది. పాఠశాలలో 10 గదులు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలోని మూడు, నాలుగు, అయిదు తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసింది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. 3 నుంచి 10 వరకూ విద్యార్థులు 416 మంది ఉన్నారు. ఉన్న గదుల్లోనే రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. ల్యాబ్‌లు, గ్రంథాలయం భవనాలను బోధనకు వినియోగిస్తున్నారు. దీంతో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం లేక ఏకాగ్రత దెబ్బతింటోంది. ఉపాధ్యాయులు బోధన చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నూతనంగా భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ ఘటనలో అరెస్టు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు కోవెలకుంట్లలో ఆదివారం ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ వివరాలు తెలిపారు. ఈనెల 15న రాత్రి కోవెలకుంట్లలో పల్సర్ వాహనం చోరీ చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారన్నారు. జమ్మలమడుగుకు చెందిన హుస్సేన్‌వలి, ప్రొద్దుటూరుకు చెందిన షేక్ ఫజిల్, మైదుకూరుకు చెందిన వాదనపల్లి అమీర్‌బాషా, మరో ముగ్గురు నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో ద్విచక్రవాహనాలు చోరీ చేశారని, గత ఎనిమిది నెలల్లో 11 వాహనాలు దొంగిలించి వాటి ఇంజిన్లు, ఛాసిస్ నంబర్లు మార్చి సెకండ్ హ్యాండ్ ద్విచక్రవాహనాలుగా విక్రయించేవారని డీఎస్పీ తెలిపారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని, 11 ద్విచక్రవాహనాలు, నాలుగు నకిలీ రిజిస్ట్రేషన్ కార్డులు, చరవాణి, ల్యాప్‌టాప్, స్ప్రే పెయింట్ బాటిల్, నంబర్ డిలీటింగ్, ప్రింటింగ్ యంత్రాలు, స్టెయిన్‌లెస్ స్టీల్‌స్కేళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలిస్తున్నామన్నారు.

పాతకక్షలతో ఇరు కుటుంబాల ఘర్షణ

ముద్దనూరు, న్యూస్‌టుడే: సోంపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. సీఐ దస్తగిరి వివరాల మేరకు.. మూలే నాగమునిరెడ్డి, ఎర్రంరెడ్డి కుటుంబానికి చెందిన రామకృష్ణారెడ్డి ఇరు కుటుంబాల మధ్య పాతకక్షలు ఉన్నాయని, దీంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో వారు కట్టెలు, రాళ్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఇరువురిలో ఆరుగురికి గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

దుత్తలూరు: బండకిందపల్లి కంకర మిల్లు వద్ద పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. బద్వేలు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన పెద్దులపల్లి సురేష్ (27) గత కొన్ని రోజులుగా కంకర క్రషర్ యంత్రం ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం కంకర మిల్లు వద్ద ఉన్న టిప్పరులో నుంచి టైర్లను దించేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో అతను ఒక కాలు నేలపై, మరో కాలును టిప్పర్ టైరుపై పెట్టి లిఫ్టును పైకి లేపారు. దీంతో విద్యుత్తు తీగలు వాహనాన్ని తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. అక్కడ పనిచేస్తున్న వారు గమనించి వింజమూరు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జమ్మలమడుగులో ఆకస్మిక తనిఖీలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగుతోపాటు ప్రొద్దుటూరు, కడప నుంచి వచ్చిన మూడు బృందాలతో సుమారు 20 మంది పోలీసులు ఆదివారం కొన్ని దుకాణాలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలో చేపట్టారు. మెయిన్ బజారులోని ఓ స్టీల్ దుకాణం నుంచి భారీగా బాణసంచా నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వాటి వివరాలు, విలువ తెలియాల్సి ఉంది. ఆ దుకాణం ఇళ్ల మధ్యనే ఉన్నందున పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణ సీఐ లింగప్ప, ఎస్ఐలు రామకృష్ణ, కల్పన, ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, టూటౌన్ ఎస్ఐ ధనుంజయుడు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ప్రజా సంఘాల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాది సహజ మరణం కాదని ప్రభుత్వ హత్యేనని వివిధ ప్రజాసంఘాల వక్తలు తెలిపారు. ఆదివారం సాయిబాబా సంస్మరణ సభను స్థానిక జేవీవీ కార్యాలయంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సాయిబాబా మరణంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా శివాలయం కూడలి వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ సాయిబాబా ప్రజల కొరకు అనేక పోరాటాలు నిర్వహించి పదేళ్ల జైల్లో తీవ్ర నిర్బంధాన్ని లెక్క చేయకుండా ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారన్నారు. పౌరహక్కుల సంఘం పట్టణ అధ్యక్షుడు సురేష్ బాబు, జేవీవీ ప్రతినిధి హేమంత్, వరలక్ష్మి, వామపక్ష నాయకులు సత్యం, సుబ్బరాయుడు, నాస్తిక సమాజం ప్రతినిధి సాయికుమార్, సమతా మహిళా విభాగం ప్రతినిధి ఉష సునీత, ఇన్నర్ వీల్ అసోసియేషన్ భారతి, చైతన్యమహిళా సంఘం ప్రతినిధి పద్మ, జమాతే ఇస్లాం ప్రతినిధి షఫి ఉల్లా, రాయలసీమ విద్యావంతుల వేదిక నుంచి దర్బాన్‌బాషా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గోపవరం పంచాయతీలో రూ.రూ.38 లక్షలు, సోమువారిపల్లె పంచాయతీలో రూ.27 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు పనులకు మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుల్లయ్య, సర్పంచులు మోష, మోపూరి ప్రశాంతి భూమి పూజ చేశారు. ఈశ్వరరెడ్డినగర్‌లో ఆదివారం పల్లె పండగ సందర్భంగా రూ.12 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు కన్నా ముందుగా కాలువలను నిర్మించాలని స్థానికులు, మహిళలు డిమాండు చేశారు. చాన్నాళ్ల నుంచి మురుగుపారుదల లేక వర్షాలు వస్తే ఇళ్ల ముందు నీటి మడుగులు నిలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ భూమి పూజ అనంతరం స్థానికులు ఈ సమస్యపై గళం వినిపించారు.

బాధితులకు పరామర్శ

బద్వేలు, గోపవరం, బద్వేలు గ్రామీణ, కలసపాడు, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థిని కుటుంబ సభ్యులను నూర్‌బాషా, దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, ఉపాధ్యక్షురాలు డాక్టర్ దిల్షాద్ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. వారు మాట్లాడుతూ విఘ్నేష్‌ను వెంటనే శిక్ష పడేలా చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. నాయకులు సలీం, మహమ్మద్‌బాసా, షరీఫ్, నాగూరయ్య, ఆదాం సాహెబ్ పాల్గొన్నారు.

✦ విద్యార్థిని మృతికి కారణమైన వ్యక్తిని పోలీసులు కఠినంగా శిక్షించాలని డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డి. విజయజ్యోతి, ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా వేర్వేరు ప్రకటనల్లో డిమాండు చేశారు.

✦ బాలిక చావుకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఐ మండల కార్యదర్శి సునీల్‌కుమార్, సహాయ కార్యదర్శి నారాయణ తెలిపారు. ఆదివారం వారు సీపీఐ శ్రేణులతో కలిసి కలసపాడులో విలేకర్లతో మాట్లాడారు. బాలికలు, కళాశాల విద్యార్థినులు, మహిళలకు రక్షణ కరవైందన్నారు.

ఆ కుటుంబానికి న్యాయం చేయాలి

బద్వేలు, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో బాలికను హతమార్చిన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసి గోవిందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం బద్వేలులో వారు విలేకరులతో మాట్లాడారు. మహిళలు, విద్యార్థినులపై అఘాయిత్యాల నియంత్రణకు గట్టి చర్యలతో పాటు నూతన చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సమావేశంలో పుర ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి వైకాపా నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం శిథిలం... సిబ్బందికి భయం

–న్యూస్‌టుడే, రాజుపాళెం

మండల కేంద్రం రాజుపాళెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో ఉండే ఉప కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నిత్యం ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇక్కడికి నిత్యం వస్తున్న ప్రజలకు, పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ భవనం పూర్తిగా పాడై పోవడంతో పైపెచ్చులు రాలి ముందు భాగంలో కడ్డీలు కనబడుతున్నాయి. కనీసం తలుపులు కూడా లేని పరిస్థితి ఇక్కడ ఉంది. అడుగు భాగం దెబ్బతినడంతో తరచూ అట్టలు కట్టి కాలయాపన చేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో ఆరోగ్య కేంద్రం లోపలికి విషపురుగులు వస్తున్నాయి. వర్షాకాలం కావడంతో ప్రతిరోజూ ఉదయాన్నే తలుపులు తీసేటప్పుడు భయంభయంగా తీయాల్సి వస్తోంది. ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పుడే చాలా చోట్ల శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు పెచ్చులూడి గాయపడుతున్న సంఘటనలు తరచూ ఇటీవలి కాలంలో జరుగుతున్నాయి. దీంతో ఇక్కడ కొత్తగా భవనం నిర్మించాలని అటు సిబ్బంది.. ఇటు ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులు కోరుతున్నారు. ఈ సమస్యపై వైద్యాధికారి డాక్టర్ మంజులను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అద్దె భవనం తీసుకోవాలని సిబ్బందికి తెలిపినట్లు చెప్పారు. కొత్త భవనం నిర్మాణం ప్రతిపాదనలు లేవన్నారు. అద్దె భవనం ఏర్పాటుకు అనుమతులిస్తామని పేర్కొన్నారు.


రాజుపాళెంలో శిథిలావస్థలో ఆరోగ్య ఉప కేంద్రం


పైకప్పు పెచ్చు రాలి కనబడుతున్న కడ్డీలు

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ఆవోపా జిల్లా అధ్యక్షుడిగా గూడూరు హరికృష్ణ

చక్రాయపేట, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియన్(ఆవోపా) జిల్లా అధ్యక్షుడిగా గూడూరు హరికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గండిక్షేత్రంలోని శ్రీ వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో నూతన కార్యవర్గసభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ సభ్యులు సంఘ అభివృద్ధికి కృషి చేయాలని వక్తలు సూచించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో గండి వాసవీ నిత్యాన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు రాయవరం శివరావు, అధ్యక్షుడు పచ్చిపులుసు మురళికిషోర్, వేంపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, వేంపల్లి ఆవోపా అధ్యక్షుడు బి.సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నృత్య సందడి

మారుతీనగర్, న్యూస్‌టుడే: శిల్పారామంలోని కళావేదికపై ఆదివారం మిస్పా మూవీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద, శాస్త్రీయ, సినిమా పాటలకు నృత్యాలు చేశారు. చిన్నారులు, నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను వీక్షించారు. శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

3న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

కడప విద్య, న్యూస్‌టుడే : అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబరు 3న కడప, రాయచోటి, ప్రొద్దుటూరుల్లో ఉర్దూ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సత్తార్‌ఫైజీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ హిదాయతుల్లా ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98851 98194 (కడప), 94416 36630 (రాయచోటి), 90000 30768 (ప్రొద్దుటూరు) నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

● ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కడప బస్టాండులో రోడ్డు దెబ్బతింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు.

● కడప ఆర్టీసీ బస్టాండు నుంచి మురళీథియేటర్ వరకు వర్షానికి రోడ్డు దెబ్బతిందని 'ఈనాడు'లో కథనం రావడంతో సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డును మరమ్మతులు చేశారు. **- న్యూస్‌టుడే, చిన్నచౌకు**

● మండలంలోని పెన్నపేరూరులో రహదారుల పక్కనే ఉన్న చెత్త పేరుకుపోయిందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై గ్రామ సచివాలయం బాధ్య కార్యదర్శి భావన స్పందించారు. చెత్త దిబ్బలను, ఇతర వ్యర్థాలను తొలగించి, శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

?: కడప రమేష్ థియేటర్ ఎదురువీధిలోని ప్రాథమిక పాఠశాల పక్కనే రెండు రోజులుగా చెత్త పేరుకుపోయింది.
- కె.బాలకృష్ణ, రాధాకృష్ణనగర్, కడప

✓: చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కరిస్తాం. **- చంద్రశేఖర్, ఎంహెచ్‌వో**
- న్యూస్‌టుడే, అరవిందనగర్ (కడప)

?: పట్టణంలోని పాత స్టేట్ బ్యాంకు వద్ద నుంచి డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు వెళ్లే దారిలో చెత్త తొట్టి నిండి కిందపడిపోయి దుర్వాసన వస్తోంది. **- రంతుల్లా, స్థానికుడు**

✓: వెంటనే ఆ ప్రాంతానికి పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్తను తొలగించే ఏర్పాట్లు చేస్తాం.
- బాలనరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కమలాపురం

?: పట్టణంలోని సొసైటీ కాలనీ నుంచి ఎల్లమ్మ గుడికి వెళ్లే మార్గంలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డుపైకి రావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. **- జయరామయ్య, స్థానికుడు**

✓: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి కంప, పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- బాలనరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, - న్యూస్‌టుడే, కమలాపురం**

చోరీల భయం... సమస్యల నిలయం

విజయదుర్గా కాలనీలో ఇదీ పరిస్థితి

న్యూస్‌టుడే, విజయదుర్గాకాలనీ (కడప జడ్పీ)

కడపలోని ప్రధాన ప్రాంతాల్లో ఒకటైన విజయదుర్గా కాలనీ పరిస్థితి పేరుగొప్ప... ఊరు దిబ్బ చందంగా ఉంది. సుమారు 2500 మందికి పైగా ఇక్కడ నివసిస్తున్నారు. ఇక్కడ చాలా మంది అధికారులు నివసిస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చాలా మంది ఇక్కడ స్థలాలను కొనుగోలు చేసి ఖాళీగా వదిలేయడంతో వాటిలో జమ్ము, పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగాయి. రాత్రి వేళల్లో విష పురుగులు, సర్పాలు తిరుగుతున్నాయి. దోమలు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రధాన రోడ్లు బాగున్నప్పటికీ 2, 3, 4, 7, 11, 12, 13 వీధుల్లో అంతర్గత రోడ్లు సరిగా లేవు. దీంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని పలుసార్లు కార్పొరేషన్ అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.


అధ్వానంగా అంతర్గత రహదారి

వరుస దొంగతనాలతో ఆందోళన

కాలనీలో తరచుగా దొంగతనాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ పోలీసు ఇంట్లోనే చోరీ జరగడం చర్చనీయాంశంగా మారింది. దీంతో స్థానికులు కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా ప్రైవేటు సెక్యూరిటీని నియమించుకున్నారు. ఈ కాలనీలో పోలీసులు గస్తీ నిర్వహించకపోవడం వల్లే తామే సొంతంగా ఖర్చు పెట్టి భద్రతాచర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.


ఖాళీ స్థలాల్లో పెరిగిన జమ్ము, పిచ్చిమొక్కలు

ఇప్పటికైనా కాలనీలో పోలీసులు గస్తీ పెంచాలని వారు కోరుతున్నారు.

సిమెంటు రోడ్లు వేయాలి



విజయదుర్గాకాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రాత్రివేళల్లో పలువురు కిందపడి గాయాలపాలవుతున్నారు. ఖాళీ స్థలాలు చాలా ఉండడంతో వర్షపు నీరు నిలబడుతోంది. దోమలు, పాముల బెడద ఉంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.
- స్వర్ణలత, విజయదుర్గాదేవి కాలనీ, కడప

గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈ నెల 22 నుంచి 25 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నజీర్‌అహమ్మద్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదపడతాయన్నారు. 22న రచ్చుమర్రిపల్లె, 23, 24 తేదీల్లో కనంపల్లె, 25న రాగిమానుపల్లె గ్రామాల్లో ఆయా సచివాలయాల వద్ద సభలు నిర్వహిస్తామని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో ఆదివారం సోగలపల్లె, నందిమండలం గ్రామాల్లో రూ.45 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డ్వామా ఇన్‌ఛార్జి పీడీ విజయకుమర్, అదనపు పీడీ నాగరత్నమ్మ, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు నరసింహులు, పీఆర్ ఏఈ రహంతుల్లా, తెదేపా మండల సమన్వయకర్త ఎస్వీ గంగిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, చీమలపెంట సర్పంచి ప్రతాప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : మండల పరిధిలోని కొండపేట గ్రామంలో సర్పంచి తుంగా చంద్రా యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి పాల్గొన్నారు. సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. గంధం మోహన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కిరణ్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీలో ఆదివారం రూ.36 లక్షలతో అభివృద్ధి పనులకు అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కుళాయిబాబు, ఈవోపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి, తెదేపా మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆది, జగన్ పాల్గొన్నారు.


పెండ్లిమర్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి

వేంపల్లె: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఇడుపులపాయ ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు పనులకు ఆదివారం మండల తెదేపా పరిశీలకుడు రఘునాథరెడ్డి భూమిపూజ చేశారు. పీఆర్ ఏఈ శ్రీనివాసులు, మండల కన్వీనర్ ఎస్.రామమునిరెడ్డి, సీనియర్ నేత మహమ్మద్‌షబ్బీర్, జనసేన అధ్యక్షుడు డాక్టర్ హరీష్, భాజపా జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కడప శివారులోని రింగ్‌రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ మార్గంలో ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ద్విచక్ర వాహనదారులకు ఆ గుంత కనిపించకపోవడంతో చాలా మంది కింద పడి గాయాలపాలవుతున్నారు. స్థానికులు గుంత చుట్టూ మొక్కలు అడ్డు పెట్టారు. అధికారులు స్పందించి దానిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, చిన్నచౌకు**

నీట మునిగిన సంపద తయారీ కేంద్రం



సిద్దవటం మండలం పొన్నవోలు శివారులో చౌడు కుంటలో గతంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. ఇందుకోసం రూ.2.76 లక్షలు వెచ్చించారు. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలతో నీరు చేరింది. చెత్త, వ్యర్థాలను వేయడానికి నిర్మించిన తొట్టెలు నీట మునిగాయి. అక్కడికి వెళ్లడానికి వీల్లేకుండా వాన నీరు ముంచేసింది. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, సిద్దవటం**

అదుపు తప్పి లారీ బోల్తా

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె వద్ద ఆదివారం మధ్యాహ్నం కూలీలతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి తోట వద్దకు అరటికాయలు కోత కోసేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని కనుమలోపల్లి, సంటిగారిపల్లె గ్రామాల్లో ఆదివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కనుమలోపల్లికి చెందిన భరత్ అనే వ్యక్తి అదే గ్రామంలోని కడప-చెన్నై జాతీయ రహదారి దాటుతుండగా కారు వేగంగా వచ్చి అతన్ని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. సంటిగారిపల్లెలో ఒక ద్విచక్ర వాహనాన్ని మరొక ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మూలపల్లె గ్రామానికి చెందిన గంగయ్య, గంగరాజు గాయపడినట్లు పోలీసులు చెప్పారు. చికిత్స కోసం వారిని విడివిడిగా 108 వాహనం ద్వారా వారిని కడప ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు..

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: నందలూరు మండలం టంగుటూరు శివారు చెయ్యేరు నుంచి ఇసుకను అక్రమంగా కడపకు రవాణా చేస్తుండగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత దాడులు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట పోలీసులు తెలిపారు. టిప్పర్ వాహనంలో అనధికారికంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కడప-రేణిగుంట జాతీయ రహదారిలో తనిఖీలు చేసినట్లు పోలీసులు వివరించారు. అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించి కేసు నమోదు చేశామన్నారు.

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

వేంపల్లె, న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే మానవతా సేవాసంస్థ లక్ష్యమని ఆ సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో ఆదివారం మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు వంశీవిహారి, సాయిసరిత, శివబాలు, యేగీశ్వర బాబులు పాల్గొని పలువురికి చికిత్సలు చేసి మందులు అందజేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు శ్రావణ్, కావలి కృష్ణతేజ, రామమునిరెడ్డి, రంగయ్య, రాజారాం తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చక్రపాణిరెడ్డి, తదితరులు

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

కమలాపురం: మండలంలోని గంగవరంలో జెండా పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు హుస్సేన్‌బాషా ఆహ్వానం మేరకు తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హాజరయ్యారు. పుత్తాను తెదేపా నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పుత్తా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాయకులు ప్రసాద్‌రెడ్డి, ఖాదర్‌బాషా, రామయ్య, రెడ్డి కరీం, నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.


పుత్తా నరసింహారెడ్డికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

రామాలయం మాజీ ఛైర్మన్ మృతికి సంతాపం


సుబ్బానాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తెదేపా నేతలు జగన్‌మోహన్‌రాజు, చెంగల్రాయుడు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్, చింతరాజుపల్లె పంచాయతీ మాజీ సర్పంచి, తెదేపా నేత బొడ్డే సుబ్బానాయుడు (74) అనారోగ్యంతో బాధ పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామమైన పత్రపల్లికి తీసుకొచ్చారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

తెదేపాతోనే ప్రభుత్వ విద్యకు మహర్దశ

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ, ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడుతోనే ప్రభుత్వ విద్యకు మహర్దశ ఉంటుందని, అందులోభాగంగానే గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 117ను రద్దు చేశారని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ అన్నారు. ఆదివారం కడపలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో వైకాపా ప్రభుత్వం పాఠశాల విద్యను అతలాకుతలం చేసిందని విమర్శించారు. బాబు, నవీన్, ఫరీద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు కృషి చేయాలి

చింతకొమ్మదిన్నె : రైతు శ్రేయస్సుకు ఇన్‌పుట్ సబ్సీడీ డీలర్లు కృషి చేయాలని అసిస్టెంటు ప్రొఫెసర్ రావూరి గిరీష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జిల్లాలోని డీలర్లకు దేశీ కార్యక్రమంలో భాగంగా శిక్షణ జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు మందులు ఇవ్వాలని సూచించారు. దేశీ కార్యక్రమం సమన్వయకర్త హిమబిందు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వికృతచేష్టలు అరికట్టాలి

కడప విద్య, న్యూస్‌టుడే : సమాజంలో పాఠశాల, కళాశాల స్థాయిలోనే విద్యార్థుల్లో వికృతచేష్టలు, విపరీత ధోరణులు ఎక్కువయ్యాయని, అక్కడే వాటిని అరికట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇటువంటి పిల్లల ప్రవర్తన గుర్తించి తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

మాజీ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి

కడప విద్య: వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యోగివేమన విశ్వవిద్యాలయంలో అక్రమాలకు పాల్పడిన మాజీ రిజిస్ట్రార్ ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఆ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మెయిల్ పంపామన్నారు. సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ పోస్టులను ఇష్టానుసారంగా భర్తీచేశారని ఆరోపించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ యాదవ్, నాయకులు మనోజ్ పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మంటపంపల్లెలో ఓబయ్య అనే వ్యక్తి నిర్వహిస్తున్న గొలుసు దుకాణంపై ఆదివారం దాడులు నిర్వహించి 25 మద్యం సీసాలు, రాచపల్లెలో సుంకేశుల మరాటి అనే వ్యక్తి నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్.ఐ శివప్రసాద్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని వివరించారు. మండలంలో ఎక్కడైనా అనధికారికంగా గొలుసు దుకాణం నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: ట్రాన్స్‌కో విద్యుత్తు కార్మికుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు సుధాకర్ కోరారు. ఆదివారం ఏపీ ట్రాన్స్‌కో (శంకరాపురం) సీఈ కృష్ణమనాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. కడప జోన్ పరిధిలో కారుణ్య నియామకాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్మికులు పని ఒత్తిడికి గురవుతున్నారని ఖాళీపోస్టులు భర్తీ చేయాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, ప్రతినిధులు ప్రతాప్, మదన్‌కుమార్, షామీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పూజలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో సురేష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందించారు.

పాలకుల నిర్లక్ష్యం... సిద్దవటానికి శాపం

న్యూస్‌టుడే, సిద్దవటం

చారిత్రక ప్రదేశంగా సిద్దవటం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది. అలాంటి ఖ్యాతి పొందిన ప్రాంతం నేడు దయనీయంగా దర్శనమిస్తోంది. పాలకులు, అధికారుల పట్టించుకోకపోవడంతో దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

సమస్యలు పదిలం.. అభివృద్ధికి దూరం

సిద్దవటంలోని పలు ప్రధాన సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రధాన రహదారి పూర్తిగా విస్తరణకు నోచుకోలేదు. ఏళ్లు గడుస్తున్నా మరికొంతమందికి పరిహారం మంజూరు కాలేదు. మూడేళ్ల కిందట రూ.36 లక్షలు మంజూరైనా పనులు చేపట్టలేదు.


దిగువపేటలో గుంతలు పడిన ప్రధాన రహదారి

దీంతో ఇరుకైన రహదారిపై సక్రమంగా రాకపోకలకు సాగక చోదకులు తిప్పలు పడుతున్నారు. కాలువలు లేక నివాసగృహాల నుంచి మురుగు నీరు ప్రధాన రహదారిపైకి చేరి రాకపోకలకు ప్రమాదకరంగా మారింది.

● ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన సబ్‌జైలు, ఉప విద్యాశాఖ కార్యాలయం, పాత ఆసుపత్రి భవనం, సామాజిక భవనాలు, ఉపఖజానా, విద్యాశాఖ, వెలుగు కార్యాలయాల మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరాయి. పలు ప్రభుత్వ భవనాలకే సొంతగూడు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

● సిద్దవటం మట్లిరాజుల కోటకు అనుసంధానంగా ఏడేళ్ల కిందట రూ.56 లక్షలతో నిర్మించిన పర్యాటకశాఖ అతిథి భవనాలు ప్రారంభానికి నోచుకోక ఏళ్లతరబడిగా నిరుపయోగంగా ఉన్నాయి. కోట ప్రహరీలు మూడేళ్ల కిందట నేలకూలగా నేటికి అవి మరమ్మతులకు నోచుకోలేదు. పురాతన కాలంలో ఎంతో పేరు పొందిన రంగనాయకస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలు పునర్నిర్మాణానికి నోచుకోక మూతపడి ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, పాలకులు దృష్టిసారించి సిద్దవటం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తిచేస్తున్నారు.